## 24వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

సాధారణముగా ప్రజలు హరే కృష్ణ మంత్రాన్ని జపిస్తే జీవనమునకు కావలసిన అవసరములన్నీ కూడా వాటంతట అవే సమకూరడం ప్రారంభిస్తాయి.

"జీవ దేహములన్నియును వర్షము వలన ఉత్పన్నమైనట్టి ధాన్యముపై ఆధారపడి జీవించును. వర్షములు యజ్ఞముచే కలుగగా, విహిత కర్మము నుండి యజ్ఞము ఉద్భవించుచున్నది." (భ.గీ. 3:14)

ఆహార పదార్థములు సమృద్ధిగా ఉత్పన్నమైనప్పుడు జంతువులు మరియు మానవులు వారి నిర్వహణకు ఏవిధమైన కష్టములు లేకుండా పోషింపబడుదురు. ఇది ప్రకృతి ఏర్పాటు. **"ప్రకృతే క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః"** (భ.గీ. 3:27) ప్రతి ఒక్కరు భౌతిక ప్రకృతి ఆధీనమునందు ప్రవర్తిస్తున్న వారే, మరియు భగవంతుడు సృష్టించిన దానిని మెరుగు పరచగలమని మూర్ఖులు మాత్రమే ఆలోచించెదరు.

సంఘముల మధ్య, జాతుల మధ్య మరియు మనుషుల మధ్య కొట్టుకోకుండా దేవదేవునిచే నియంత్రితమవుతున్న నియమములను గమనించడం ప్రత్యేకించి గృహస్థుల బాధ్యత. దేవుని యొక్క బహుమతులను, ప్రత్యేకించి ఆకాశము నుండి పడుతున్న వర్షము వలన ఉత్పన్నమగు ఆహార ధాన్యములను మానవ సంఘము సవ్యముగా ఉపయోగించుకోవాలి. భగవద్గీత యందు చెప్పినట్లుగా **"యజ్ఞాత్ భవతి వర్జన్యః"** (భ.గీ. 3:14) కాబట్టి యజ్ఞములను నిర్వహించడం వలన వర్షపాతము అదుపులో ఉంటుంది. పూర్వము యజ్ఞములు నెయ్యి ఆహార ధాన్యములను సమర్పించడం ద్వారా నిర్వహించెదరు. అయితే మానవ సంఘపు పాపభూయిష్టమయిన జీవనము వలన ఏర్పడిన నెయ్యి ఆహార ధాన్యముల ఉత్పత్తిలో కొరత వలన ఈ యుగమున ఇది సాధ్యము కాదు. ఏమైనప్పటికీ కృష్ణ చైతన్యమును అంగీకరించాలి. శాస్త్రములయందు చెప్పబడినట్లు హరే కృష్ణ మంత్రమును జపించాలి. **"యజ్ఞైః సంకీర్తన ప్రాయైర్ యజంతి సుమేధసః"** (శ్రీమద్ భాగవతము 11:5-32).

ప్రపంచము అంతటా ప్రజలు కృష్ణ చైతన్యమును గ్రహించి దేవదేవుని దివ్య నామములను జపిస్తూ, వైభవములను కీర్తిస్తూ ఉంటే వర్షపు కొరత ఉండనే ఉండదు. తత్ఫలితముగా ఆహార ధాన్యములు పళ్ళు మరియు పూల సమృద్ధిగా ఉత్పన్నమవుతాయి. జీవనమునకు కావలసిన అన్ని రకములు సమకూరుతాయి. అటువంటి ప్రకృతి సహజమైన ఉత్పత్తులకు గృహస్థులు బాధ్యత వహించాలి. అందుకనే **"తస్యైవ హేతోః ప్రయతేత కోవిదః"** అని చెప్పబడింది. దేవుని పవిత్ర నామములను జపం చేయడం ద్వారా బుద్ధిమంతులైన వారు కృష్ణ చైతన్యమును వ్యాప్తి చెందించుటకు ప్రయత్నించాలి. జీవనమునకు కావలసినవన్ని వాటంతట అవే అనుసరిస్తాయి.

## చర్చ - విషయ విభాగము

## ఆధ్యాత్మిక విద్య

పూజ్యులైన శ్రీ శ్రీ ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు రచించిన "భగవద్గీత యథాతథం" నందు అధ్యాయం 9 శ్లోకము 27 నుండి గ్రహింపబడినది.

*యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్*
*యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణం*

"ఓ కౌంతేయ! నీవు ఏది ఒనరించినను, ఏది భుజించినను, ఏది హోమము చేసినను, ఏది దానమొసగినను, ఏ తపస్సు నాచరించినను వాటన్నింటిని నాకు అర్పణముగా ఒనరింపుము."

ఎట్టి పరిస్థితి యందును శ్రీకృష్ణ భగవానుని మరువకుండునట్లుగా జీవితమును మలచుకొనుట ప్రతియొక్కరి ధర్మము. దేహపోషణ కొరకు ప్రతియొక్కరు కర్మ చేయవలసియే ఉన్నందున తన కొరకు కర్మ చేయుమని శ్రీకృష్ణుడు ఇచ్చట ఉపదేశించుచున్నాడు. జీవనమునకై ఆహారమును భుజించుట అవసరము గనుక కృష్ణునకు అర్పింపబడిన ఆహారమునే ప్రసాద రూపమున మనుజుడు గ్రహింపవలెను. అదే విధముగా నాగరికుడైన మనుజుడు ధర్మకార్యములను ఒనరింపవలసియున్నందున వానిని తన కొరకే చేయమని శ్రీకృష్ణుడు పలుకుచున్నాడు. అదియే అర్చనము. ప్రతియొక్కరు ఏదియో ఒకదానిని దానమిచ్చు స్వభావమును కలిగియుందురు కావున దానిని తనకే ఒసగుమని శ్రీకృష్ణుడు ఉపదేశించుచున్నాడు. అనగా అధికముగా ప్రోగుపడిన ధనమును మనుజుడు కృష్ణచైతన్యోద్యమపు ప్రచారము కొరకై వినియోగించవలెను. ధ్యానము ఈ యుగమునకు ఆచరణయోగ్యము కానిదైనను మనుజులు దానియందే నేడు ఎక్కువ మక్కువను కలిగియున్నారు. కనుక ఎవరైనను హరే కృష్ణ మంత్రమును జపమాలపై జపించుచు శ్రీకృష్ణుని ఇరువది నాలుగు గంటలు ధ్యానింపగలిగినచో భగవద్గీత యందలి షష్ఠాధ్యాయమున వివరింపబడినట్లు గొప్ప ధ్యానతత్పరుడు మరియు గొప్పయోగి కాగలడు.

**కనుగొనండి :**

1. కృష్ణుడు తనకు అర్పించమని అడుగుతున్న దినచర్యలలో కొన్నింటిని తెల్పండి?

**అవగాహన :**

1. రోజంతా మనము కృష్ణుని గూర్చి ఆలోచించడం సంభవమా? అయితే ఎలా?
2. మనము గొప్ప యోగిగా అవ్వాలనుకుంటే ఎలా మొదలు పెడతాము?

**అనువర్తనము :**

1. రోజంతా కృష్ణుని గూర్చి ఆలోచించుటలో మీరు ఎదుర్కొనే అడ్డంకులు కొన్నింటిని చర్చించండి? వాటిని మీరు ఏవిధంగా ఎదుర్కొనగలరని ఆలోచిస్తున్నారు?

# ప్రచారమే సర్వసారము

పూజ్యనీయులు ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు.

ఆధ్యాత్మిక గురువు గారి ఆజ్ఞ ప్రకారము భక్తుడు ప్రపంచమంతటా ప్రచారము చేయవలెను.

ఎక్కడో ఒక చోట కూర్చోవడం కాకుండా ప్రపంచమంతటా భక్తిని వ్యాపింపజేయడాన్ని శ్రీ చైతన్య మహాప్రభువు భక్తి మార్గము బోధిస్తుంది. పవిత్ర స్థలాలను వెలికి తీసి పునరుజ్జీవింపజేయడానికి భక్తి మార్గమును స్థాపించడానికి చైతన్య దేవుడు సనాతన గోస్వామిని, రూప గోస్వామిని బృందావనమునకు పంపించెను. అందుకనే బృందావనము సనాతన గోస్వామి మరియు రూప గోస్వాములకు నివాస స్థలమైనది.

ఇదే విధంగా చైతన్య మహాప్రభువు భక్తి మార్గమున ఉన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక గురువుగారి వాఖ్యములను అంగీకరించి కృష్ణ చైతన్యోద్యమమును వ్యాపింప చేయవలెను. కృష్ణుని వద్ద నివాసులచే ఇవ్వబడిన స్థావరములను "ప్రభు దేశ దత్త" ముగా అంగీకరించి వారు ప్రపంచమున అన్ని ప్రాంతములకు వెళ్ళవలెను.

ఆధ్యాత్మిక గురువు కృష్ణుని యొక్క ప్రతినిధి. కావున ఆధ్యాత్మిక గురువు గారి ఆజ్ఞలను అనుసరిస్తున్నారంటే వారు కృష్ణుడు లేదా శ్రీ చైతన్య మహాప్రభుల ఆజ్ఞలను అనుసరిస్తున్నారని అర్థము చేసుకోవాలి.

భక్తి మార్గము ప్రపంచమంతటా వ్యాపించాలని శ్రీ చైతన్య మహాప్రభువు కోరుకొనెను. "పృథ్వితె అచె యత నగరాది గ్రామ". కావున ఆధ్యాత్మిక గురువు గారి ఆజ్ఞ ప్రకారము కృష్ణ చైతన్యములో ఉన్న వారు ప్రపంచమున వివిధ ప్రాంతములకు వెళ్ళి ప్రచారము చేయవలెను. అది చైతన్య మహాప్రభువును తృప్తి పరుస్తుంది.

***చైతన్య చరితామృతము (అంత్య లీల 4:144)***